నాగరాణి

వాణిశ్రీ

సాయంకాలం ఆరుగంటలకి ఇంటికి వెళ్ళి స్నానంచేసి టాయ్‌లెట్ అయిన తర్వాత కాస్మోపాలిటన్ క్లబ్‌కి వెళ్ళడం జగపతిరావు కొన్ని సంవత్సరాల నుంచి మెయింటెన్ చేస్తున్నాడు.

అందుకే సరిగ్గా ఆరయ్యేసరికి పోర్టికోలో కారు రెడీ చేస్తాడు డ్రైవర్.

బజ్జర్ నొక్కే సమయానికి డోర్ తియ్యడానికి సిద్ధంగా వుంటాడు జవాను.

లక్ష్మి ఇంజనీరింగ్ కంపెనీ యజమాని జగపతిరావు డిసిప్లిన్డ్‌గా వుంటాడని మంచి పేరు తెచ్చుకున్నాడు. మంచిగాని చెడుగాని సిన్సియర్‌గా చేస్తాడని అతని సర్కిల్లో గొప్పగా చెప్పుకుంటారు.

ఇంతకీ అతను అరవైఏళ్ళ యువకుడు కానేకాదు, ముప్ఫైఏళ్ళ కుర్రాడే.

ఆ రోజు—

జగపతిరావు కుర్చీలోంచి లేవాలనుకునే సమయానికి టెలిఫోన్ రింగైంది.

రిసీవర్ ఎత్తి "జగపతిరావ్ స్పీకింగ్" అన్నాడు.

"గుడీవినింగ్ డియర్ రావ్!" తియ్యటి కంఠం విని పించి ఆశ్చర్యపోయాడు.

అతన్ని డియర్ రావ్ అని పిలిచేవాళ్ళు ఆ వూళ్ళో ఎవరూ లేరు. అతని భార్య అతనికి ఎప్పుడూ ఫోన్ చెయ్యదు. చేసినా "ఏవండీ" అనే అంటుంది.

"ఎవరో జ్ఞాపకం రాలేదా డియర్ రావ్?" నవ్వు వినపించింది గజ్జులు ఘల్లు ఘల్లుమన్నట్లు.

అతను మతిపోయినవాడిలా వుండిపోయాడు.

'ఆ గొంతు అతనికి చిరపరచితమైనదే.'

"నువ్వు....నువ్వు...."

"నేనే నీ డార్లింగ్ రూపని" మళ్ళీ నవ్వు.

జగపతిరావు ముఖం వెయ్యికాండిల్ బల్బులా వెలిగి పోయింది రూప పేరు విని.

"రూపా! నువ్వా ఎన్నాళ్ళకి...."

"నువ్వు నన్ను మర్చిపోయినా నేను నిన్ను మర్చి పోలేదు రావ్!" గోముగా అంటోంది రూప.

"ఇంతకీ ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావ్?"

"కైలాసపురం నుంచి."

"అక్కడెందుకున్నావ్?"

"అదేం ప్రశ్న? కైలాసపురం ఎవరైనా ఎందుకు వెళ్తారు? దేవుడి దయకోసం. నేనూ అందుకే వచ్చాను."

"మీ వారితో వచ్చావా?"

"నో....ఆయనతో వస్తే నీ కెందుకు ఫోన్ చేస్తాను. ఆ మాత్రం తెలుసుకోలేవా?"

"ఎస్ .... ఐ నో ...."

"చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను. నీతో సీక్రెట్ గా మాట్లాడాలి. ఎంత సీక్రెట్ అంటే చచ్చేంత సీక్రెట్."

"సీక్రెటా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"యస్. సీక్రెట్ బిజినెస్."

"బిజినెస్సా!"

"అదంతా పర్సనల్ గా మాట్లాడుకుందాం. రాత్రి ఎనిమిదింటికి ఇక్కడకిరా. నేను కొండమీద స్పెషల్ కాటేజీ నెం. 14 లో వున్నాను. అయితే భోజనం చేసి రాకు. అంతా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నాను. ఈ రాత్రికి ఇక్కడే వుండిపోయాలి. ఎన్నాళ్ళయిందో నీతో గడిపి...." తియ్యగా మత్తుగా అంటోంది రూప.

జగపతిరావు గుండె లయతప్పుతోంది రూప మాటలు వింటూ వుంటే.

"మీ ఆవిడకు ఏదో చెప్పిరా! ఏమంటావు మాట్లాడవేం డియర్!"

"ఏం మాట్లాడను డార్లింగ్. నాకు ఆనందంతో మాటలు రావడంలేదు."

నవ్వు వినిపించింది గలగలా.

"ఓ.కే...."?

"ఓ.కే...."

అవతల ఫోన్ పెట్టేసినట్లు క్లిక్ మంది. జగపతిరావు రిసీవర్ క్రెడిల్ చేసి ఈజీగా కూర్చున్నాడు ఛైర్ లో.

అతనికి సంతోషంతో శరీరం తేలికైపోయి గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది.

రూప ...ఎంత తియ్యగా వుంటుందో ఆ పేరు. ఐదేళ్ళ

క్రితం రూపతో అనుభవాలు కోకొల్లలు. మధురంగా క్షణాల్లా గడిచిపోయాయి రోజులు.

అసలు రూప తనభార్య కావలసింది.

డాడీకి ఇష్టంలేకపోయింది. అంతస్తులు అడ్డొచ్చాయి పెళ్ళికి. తను నిస్సహాయ స్థితిలో రూపను వదిలేయాల్సి వచ్చింది.

'హెల్ప్‌లెస్ కండిషన్' గొణుక్కున్నాడు.

తర్వాత తనంటే మండిపడేది రూప. మోసగాడివని తిట్టేది. తన ముఖం చూశ్ళేదు మళ్ళీ.

తను ఎంత తపించిపోయాడు రూపతో అనుభవం కోసం. కాని ఏం లాభం తనను రానివ్వలేదు దగ్గరికి.

ఇన్నాళ్టికి క్షమించింది తనను.

'బహుశా ఆమెకు భర్తతో సుఖం లేదేమో?' ఆ ఆలోచన రాగానే జగపతిరావుకి హుషారెక్కింది.

తనవంటి పర్సనాల్టీగల మగాళ్ళు చాలా అరుదు. సినిమాల్లో జేరితే హీరోవేషాలు వేసేవాడు. అందుకూ ఒప్పుకోలేదు డాడీ. పూర్ డాడీ.

'ముఖానికి రంగుకొట్టుకుని తైతెక్కలాడే కర్మ మనకేం పట్టిందిరా?' అనేవాడు.

అందులో యెంత గ్లామర్ వుందో డాడీకి యేం తెలుసు.

నవ్వుకున్నాడు జగపతిరావు.

తండ్రి పోయాడు. తను సర్వస్వతంత్రుడయ్యాడు. కాని సినిమా వేషాలమీద దృష్టిపోలేదు. ఎందుకొచ్చిన రిస్క్. బిజినెస్‌లోనే హాయిగా వుంటుంది అనుకున్నాడు.

జగపతిరావు బజ్జర్ నొక్కాడు.

జవాన్ తలుపు నెట్టుకుని వచ్చి చేతులు కట్టుకుని

ఆజ్ఞ అన్నట్లు నిల్చున్నాడు.
"కారు రెడీ చెయ్యమను" అన్నాడు.

2

కైలాసపురం అక్కడికి నాలుగు మైళ్ళ దూరంలోవుంది. పురాణకాలం నుంచీ గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కింది. కొండమీద శివాలయానికి బస్సులు వెళ్ళడానికి ఘాట్ రోడ్డు వుంది. వచ్చేపోయే జనంతో ఎంతో సందడిగా, కోలాహలంగా వుంటుంది కైలాసపురం.

జగపతిరావు హుషారుగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాడు. ఎన్నో ఏళ్ళ తర్వాత తన పాత ప్రేయసిని కలుసుకోబోతున్నాననే సంతోషంతో వుప్పొంగి పోయింది మనస్సు.

అరగంటలో కొండపైకి వెళ్ళిపోయాడు.

కాటేజీ నెం. 11 ముందు కారు ఆపాడు. దూరం దూరంగా అందంగా వున్నాయి కాటేజీలు.

కారుహారన్ శబ్దం విని కాటేజీ తలుపులు తెరుచుకున్నాయి.

లోపల తెల్లటి ట్యూబ్ లైట్ వెలుగులో నిల్చున్న రూపను చూసి క్షణంపాటు కళ్ళు పెద్దవిచేశాడు జగపతిరావు.

'ఎంత మారిపోయింది?' అనుకున్నాడు ఆశ్చర్యంగా.

ఆ రోజుల్లో చీరలు కట్టుకుని మల్లెపువ్వులా తాజాగా పరిమళిస్తూ వుండేది.

ఇప్పుడో! లుంగీకట్టుకుని అర్ధనగ్నంగా మోడరేట్ గా క్లబ్ డాన్సర్ ని మరిపిస్తోంది.

బాబ్ డ్ హెయిర్ లో రూపని చూసి అతని కళ్ళు చెది

రాయి. అప్పటికన్నా బాగా వళ్ళు చేసింది. శరీరంలోని వంపుసొంపులన్నీ స్పష్టంగా కనిపించేటట్టు డ్రెస్ చేసుకుంది.

రూప అంత సెక్సీగా వుంటుందని కలలోగూడా వూహించలేదు అతను.

"కమాన్! ఏమిటలా నిలబడిపోయావు?" అంది ఆమె.

జగపతిరావు తేరుకున్నాడు.

"ఏంలేదు. నీలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోతున్నాను" అన్నాడు లోపలకు వస్తూ.

"మార్పు మానవసహజం...." నవ్వింది.

జగపతిరావు లోపలకు రాగానే తలుపులు మూసి గడియ వేసింది.

అమాంతం అతన్ని కౌగిలిలో బంధించి వేసింది. ఉక్కిరి బిక్కిరి చేస్తూ అతని ముఖాన్ని ముద్దులతో నింపివేసింది.

"డియర్ రావ్! నిన్ను వదిలి ఇంతకాలం యెలా వున్నానో నాకే అర్థంకావటంలేదు" గోముగా అంది.

జగపతిరావుకి స్వర్గంలో తేలిపోతున్నట్లుగా వుంది ఆమె వెచ్చని కౌగిలి.

"నేనూ అంతే డార్లింగ్. అప్పుడు పిరికివాడిలా నిన్ను దక్కించుకోలేకపోయాను" అన్నాడు విచారం వ్యక్తపరుస్తూ.

"ఆ రోజులు గుర్తుచేయకు డియర్. అదంతా ఒక పీడకల. గతంలేదు మనకి. భవిష్యత్తు మాత్రమే. యవ్వనం ఎంతోకాలం వుండదు. అందువే వీలైనంత జుర్రుకుందాం" అంది.

జగపతిరావు గాలిలో తేలిపోయాడు.

మొగలిసెంట్ సువాసన గదంతా నిండిపోయి కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోంది. రూప వుపయోగించిన ఖరీదైన కాస్మటిక్ పరిమళాలు అతనికి మత్తు కలిగిస్తున్నాయి.

ఆమెకు ఏదో గుర్తుకొచ్చినట్లుగా అతని చేతుల్ని తన నడుము నుంచి తప్పించి "పద భోజనం చేద్దాం" అంది.

అతను తేరుకుని బాత్‌రూమ్‌లో ముఖం సబ్బుతో కడుక్కున్నాను. పౌడర్ రాసుకుని డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు.

రూప రెండుగ్లాసులు విస్కీతో వాటర్‌తో నింపింది.

ప్లేట్లలో జీడిపప్పు, నాన్-వెజిటేరియన్ డిషెష్ చూసి అతని కళ్ళు తిరిగాయి.

రూప అతనికి ఒక గ్లాసు అందించింది.

తనొక గ్లాసు తీసుకుంది.

"ఛీర్స్...." అంది గ్లాసుకు తగిలిస్తూ.

అతనికి గుండె దడపుట్టింది రూప చేష్టలకు.

"ఏమిటి? నువ్వు త్రాగడం నేర్చుకున్నావా?" అడిగాడు.

"ఆఁ....ఏం తప్పా? మగాడిబుద్ధి పోనిచ్చుకున్నావు గాదు" అంది నవ్వుతూ.

"నో....నో....డార్లింగ్ ఆడవాళ్ళు త్రాగకూడదని కాదు" అన్నాడు తత్తరపడిపోతూ.

"నేను అందరిలాంటి ఆడదాన్ని కాదు. ఆ సంగతి నువ్వే గ్రహిస్తావు డియర్" అంది.

ఒక గంటసేపు కబుర్లు చెప్పుకున్నారు.

భోజనం పూర్తయిన తర్వాత బెడ్‌మీద చేరుకున్నాడు రావ్.

అతనికి ఎంతో ఆత్రంగా వుంది రూప పొందుకోసం.

సెక్స్ ఆకలి కడుపులో వెర్రితలలు వేస్తోంది.

రూప నైట్ గౌన్ లో మెరిసిపోతున్న అందంతో దంతశిల్పంలా కన్పించింది.

ఆమె చేతిలో ఒక డైమండ్ నెక్లెస్ వుంది.

"చూడు ఈ నెక్లెస్ ఖరీదు ఎంతో చెప్పు?" అంది అతని మీదకు విసురుతూ.

అతని కళ్ళు మిరుమిట్లు గొల్పాయి దాన్ని చూడగానే.

"ఎక్కడిది ఇది?" అన్నాడు నివ్వెరపోయి.

"దొంగతనం చేశాను" తాపీగా అంది.

కరెంట్ షాక్ తిన్నట్లుగా అదిరిపడ్డాడు. మత్తు దిగిపోయినట్లయింది.

"వాడ్డూయూ మీన్?" అన్నాడు.

"కంగారుపడకు మిష్టర్ రావ్. ఈ రూప ఆ నాటి రూపకాదు. సరికొత్త రూపం ఎత్తింది. నేను అప్పటి దరిద్రపు రూపను కాను. కోట్లున్నాయి నా దగ్గర. అండర్ స్టాండ్" అంది.

"ఈజిట్?"

"యస్. ఇప్పుడు చెప్పు? నీ ఆస్తి మొత్తం విలువ ఎంత?"

"పదిలక్షలు వుండవచ్చు."

"ఒక్కరోజులో నిన్ను ఇరవైలక్షల ఆస్తికి అధిపతిని చేస్తాను" చిటికవేసింది గమ్మత్తుగా.

"ఎలా చేస్తావ్?"

"విను. నా దగ్గర డైమండ్స్, బంగారం యెంతో మూలుగుతోంది. అంతా దొంగతనంచేసి సంపాదించింది. సగం ధరకు నీకు ఇస్తాను తీసుకో. నువ్వు డబున్నవాడివి కనుక ఎవరూ అనుమానించరు. ఆ నగలు కరిగించుకుని

మార్కెట్లో అమ్ముకో. ఫినిష్" అంది.

జగపతిరావు కళ్ళు మెరిశాయి. తమ తాతలు, ముత్తాతల దగ్గర్నుంచి కూడబెడుతే ఇప్పటికి పదిలక్షల ఆస్తి చేరింది. తను రాత్రికి రాత్రి పదిలక్షలు సంపాదిస్తాడు. "ఐ యామ్ వెరీ లక్కీ ఫెలో" మత్తుగా అన్నాడు.

"నువ్వు నా ప్రియుడివి కాబట్టి నీకీ అవకాశం ఇస్తున్నాను. జాగ్రత్తగా బిజినెస్ చేసుకో. అదృష్టం నీ కాళ్ళ దగ్గరికి వచ్చింది" అంది రూప.

"అవునూ! అసలు నువ్వెందుకు దొంగవయ్యావు?" అనుమానంగా ప్రశ్నించాడు.

"డోంట్ గో టూ సైడ్ ట్రాక్ మిష్టర్ రావ్. నువ్వు నీ బిజినెస్ చూసుకో. అనవసరమైన విషయాల జోలికి పోవద్దు" కోపంగా అంది.

"సారీ రూపా!" అన్నాడు ఆమెకు కోపం వచ్చిందని గమనించి.

"నీ ఆస్తి పదిలక్షలు వుంది. కాని నువ్వు క్యాష్ రూపంలో ఎంత యివ్వగలవు? నీ క్యాష్‌కు మార్కెట్ రేటునుబట్టి రెట్టింపు బంగారం ఇస్తాను. అదీ ఈ ఒక్క సారికే" అంది రూప.

జగపతిరావు తల గోక్కున్నాడు.

"ఎంత క్యాష్ తీసుకురాగలనో అంతా తీసుకొస్తాను" అన్నాడు.

"ఎప్పుడు? కరెక్టుగా నిముషాలతో సహా చెప్పాలి."

"రేపురాత్రి ఏడింటికి."

"ఓ. కే. ఇక్కడికే రావాలి" అంది రూప.

"ఓ. కే" అంటూ అతను రూప చేతిని అందుకున్నాడు. ఆమె ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లతలా అతన్ని

అల్లుకుపోయింది.

"డియర్ రావ్!"

"వూఁ...."

"స్వర్గంలో వున్నట్లుంది గదూ!"

"వూఁ...."

"మనం ఇలాగే స్వర్గానికి వెళ్ళిపోదామా?"

"ఆఁ....ఆల్ రైట్" అన్నాడు అతను.

"ముందు నువ్వెళ్ళు తర్వాత నేనొస్తాను."

"నో....నో....ఇద్దరం కలిసే....ఇలాగే...."

"ఓ.కే....ఓ.కే...." ఆమె వికృతంగా నవ్వింది.

3

ఒకటో నెంబరు కాటేజీలో జనం సందడిగా వున్నారు. మంగళవాయిద్యాలు మ్రోగుతున్నాయి. రాఘవరావు తన ఇద్దరు పిల్లలకు పుట్టెంటికలు తీయిస్తున్నాడు. అదీ హడావుడి.

ఎవరి గొడవలో వాళ్ళుంటే దేవుడిప్రసాదం వున్న వెండిగిన్నెను తస్కరించి కాటేజీ ప్రహరీ గోడమీద కూర్చుని భోంచేస్తూ వుంది ఒక కోతి.

రాఘవరావు భార్య చూసింది. జనం గోడదగ్గరికి రాగానే కోతి కంగారుపడి ఒక్కగెంతు గెంతింది.

ఏదైనా స్టీలుగిన్నె అయితే పోనీలే అని వూరుకో వచ్చు. రెండువందలు చేసే వెండిగిన్నె. చూస్తూ యెలా వూరుకోవడం. రాఘవరావు కర్ర పట్టుకుని కోతివెంట పడ్డాడు.

కోతి ముప్పతిప్పలు పెట్టింది అతన్ని. రాఘవరావుకి సహాయంగా ఇద్దరు కుర్రాళ్ళు గూడా వచ్చారు. గుడికి చాలా దూరం తీసికెళ్ళింది కోతి. కొండమీద ఎగుడు

దిగుడు బండలు ఎక్కి దిగి అలసిపోయాడు రాఘవరావు.

ఆఖరికి ఒక పెద్ద మర్రిచెట్టు దగ్గరికి పరిగెత్తింది. రాఘవరావు వెంబడించాడు.

అతని వెంట వచ్చిన కుర్రాళ్ళు కెవ్వుమన్నారు. రాఘవరావు అదిరిపడి వాళ్ళవంక చూశాడు. వాళ్ళిద్దరూ వణికిపోతూ చేతులు ఎత్తి చూపించారు ఆ దృశ్యాన్ని.

మర్రిచెట్టుకి శవం వ్రేలాడుతూ వుంది.

కొంచెం దూరంలో నల్లటికారు లేత ఎండలో నిగనిగ లాడుతూ వుంది.

రాఘవరావుకి గుండె దడపుట్టింది. భయంలో శరీరం కంపించింది. కాళ్ళు వణుకుతున్నాయి.

వెండిగిన్నె మాటే మర్చిపోయాడు. తిరుగుముఖం పెట్టాడు పరుగులాంటి నడకతో. ఆ కుర్రాళ్ళూ పరిగెత్తారు.

దేవాలయానికి తూర్పున ఫర్లాంగు దూరంలో మర్రిచెట్టుకి శవం వ్రేలాడుతున్న సంగతి దేవస్థానం ఆఫీసులో చెప్పాడు రాఘవరావు.

ఆ దారుణవార్త కైలాసపురంలోని సత్రాల్లోను, కాటేజీల్లోను వున్న వాళ్ళందరికీ తెలిసిపోయింది. అంతా దైవదర్శనానికి బదులుగా శవదర్శనానికి బయల్దేరారు.

కొండక్రింద కైలాసపురం పోలీస్ స్టేషన్ నుంచి పోలీసువ్యాను వచ్చింది. అప్పటికి జనం గుంపులు గుంపులుగా వున్నారు.

ఇనస్పెక్టర్ శ్రీహరిరావు శవాన్ని గుర్తుపట్టి ఆశ్చర్యపోయాడు.

ఆ శవం జగపతిరావుది. అతను ఇనస్పెక్టర్ శ్రీహరిరావుకి బాగా పరిచయం వుంది. లక్ష్మీ ఇంజనీరింగ్ కంపెనీ

ప్రొప్రయిటర్ అతను. ఆ నల్లకారు గూడా అతనిదే.

కైలాసపురానికి ఆనుకునే వున్న కపిలనగరం టౌన్‌లో జగపతిరావు ప్రముఖుడే. హైసొసైటీలో అతనికి మంచి పేరుంది. కాస్మోపాలిటన్ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్నో ధర్మకార్యాలు చేసాడు.

శ్రీహరిరావు మనసులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. జగపతిరావుని యెవరు హత్య చేశారు? ఎందుకు?

కపిలనగరం నుంచి డియస్పీ గూడా వచ్చాడు.

ఇనస్పెక్టర్ శ్రీహరిరావు సెల్యూట్ చేసి "అతను జగపతిరావు సార్!" అన్నాడు.

"ఐ నో....ఐ నో...." అన్నాడాయన.

శవాన్ని క్రిందకు దించారు. శవ పంచాయితీ చేశాడు ఇనస్పెక్టర్.

ఫోటోగ్రాఫర్ అన్ని కోణాల నుంచీ ఫోటోలు తీస్తున్నాడు.

ఫింగర్ ప్రింట్ నిపుణుడు కారుమీద పౌడర్ చల్లి వేలిముద్రలు ట్రేస్ చేస్తున్నాడు.

కాసేపటికి అతని భార్య పిల్లలు, బంధువులు టాక్సీల్లో వచ్చారు.

అతని భార్య శవంమీద పడి గోడు గోడున ఏడుస్తోంది.

చూసేవారి హృదయాలు ద్రవించిపోతున్నాయి ఆ దృశ్యం చూసి.

తర్వాత శవాన్ని పోస్ట్‌మార్టమ్ రిపోర్టుకోసం కపిలనగరం హాస్పిటల్‌కి పంపించారు.

ఉరితీసినందువల్లనే జగపతిరావు మరణించాడని పోస్టు

మార్టమ్ రిపోర్టులో తేలింది. అతను రాత్రి పదింటికి మర ణించాడని ధృవపరిచారు.

జగపతిరావు కారుమీద అతని వేలిముద్రలు కాక వేరే ఎవరివో వున్నాయి. అవి అతని కంపెనీలో పనిచేసే జవాన్, మేనేజర్, ఆతని భార్య.... అతని సన్నిహితులకు సంబంధించినవి కావు.

అవి పాత నేరస్తులకు సంబంధించినవేమో తెలుసు కోవడానికి ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు పంపించారు.

డబ్బుకోసమే అతన్ని హత్య చేశారని ఇన్వెస్టిగేషన్ చేసిన ఇనస్పెక్టర్ శ్రీహరిరావు అభిప్రాయపడ్డాడు. కపిలనగరంలో అతను అజాత శత్రువు. కంపెనీలో వర్కర్లతో గూడా చనువుగా వుంటాడు. జీతాలు పెంచే విషయంలో వుదారంగా ప్రవర్తిస్తాడు. సమ్మెవంటి పరి స్థితులకు ఆ కంపెనీ వర్కర్లకు అవకాశం ఇవ్వలేదు.

అతని భార్యగూడా అతని హత్య గురించి ఏమీ చెప్పలేకపోయింది. ఆమెవద్ద పనికివచ్చే విషయాలులేవు.

పోతే, లక్ష్మి కంపెనీ మేనేజర్ కోటేశ్వరరావు కొంత సమాచారం ఇచ్చాడు. కంపెనీ ఎకౌంట్స్‌లో వున్న క్యాష్ అంతా డ్రా చేశాడనీ, అంతేకాక నలుగురు మిత్రుల దగ్గర అప్పుగూడా తీసుకున్నాడనీ, మొత్తం దాదాపు అయిదులక్షలు వుంటుందనీ తెలియ జేశాడు. అంత డబ్బు ఎందుకు డ్రా చేస్తున్నారని అడిగితే ఏదో క్రొత్త బిజినెస్ స్టార్ట్ చేస్తున్నాడని మాత్రం చెప్పాడట.

ఆదేమిటో మాత్రం చెప్పలేదు.

కపిలనగరంలో ఏ.సి. సినిమా థియేటర్ కట్టించాలనే కోరిక జగపతిరావుకి గాఢంగా వుందట. మొత్తం పాతిక

లక్షలు అవుతుందని అంచనా వేశాడనీ. బస్సుస్టాండ్ దగ్గర రెండువేల గజాల స్థలం కొనాలని చూస్తున్నాడనీ, కాని స్థలానికే ఆరేడు లక్షలు అడుగుతున్నారనీ, ఐదు లక్షలకిస్తే కొంటానన్నాడనీ కోటేశ్వరరావు చెప్పాడు.

బహుశా, క్రొత్తబిజినెస్ అదే కావచ్చు అన్నాడు.

ఆ స్థలం అబ్దుల్ సత్తార్ అనే అతనిది. అతనికి ఆటోగ్యారేజీ వుంది. లారీలు నడిపిస్తున్నాడు. ఆ స్థలం అమ్మాలని తను అనుకున్నాడనీ, జగపతిరావు బేరమాడిన సంగతి నిజమేననీ, అదంతా ఆర్నెల్ల క్రితం సంగతనీ, తర్వాత మాటలు జరగలేదనీ చెప్పాడు సత్తార్.

జగపతిరావు అంత డబ్బు హడావుడిగా సేకరించిన పద్ధతి చూస్తే ఏదో క్రొత్త వ్యాపారం మొదలుపెట్టడానికే అయివుంటుంది.

'ఆ డబ్బున్న సూట్ కేస్ తో అతను కైలాసపురం వెళ్ళివుంటాడు. దేవుడికి అర్చన చేయించడానికి. అది ఎవరో కనిపెట్టి దోచుకున్నారు తెలివిగా. సెంటిమెంటల్ ఫూల్' అనుకున్నాడు ఇనస్పెక్టర్ శ్రీహరిరావు.

డిస్ట్రిక్టు క్రిమినల్స్ ని చాలా మందిని ప్రశ్నించారు. మోడ్ ఆఫ్ క్రైమ్స్ ని బట్టి దొంగతనాలు చేసేవాళ్ళ లిస్టులు తిరగేశారు. ఈ రోజుల్లో అంతా కత్తితోనో, పిస్టల్ తోనో మర్డర్లు చేసి దోచుకునేవాళ్ళే తప్ప వురితీసి చంపేవాళ్ళు ఎవరు?

కారుమీద దొరికిన ఫింగర్ ప్రింట్స్ పాత నేరస్తులవి కావని బ్యూరో నుంచి సమాధానం వచ్చింది.

మొత్తానికి డబ్బు దోచుకుని జగపతిరావుని పురితీసి హత్య చేసిన నేరస్తులు దొరకలేదు.

జగపతిరావుకి అప్పులిచ్చిన మిత్రులు లబోదిబో మంటున్నారు.

నెమ్మదిగా అప్పులు తీరుస్తామని జగపతిరావు బావమరిది ప్రామిస్ చేశాడు. అతనే అక్కడ తరఫున కంపెనీ నడుపుతున్నాడు.

పోలీసులు గాలిస్తూనే వున్నారు హంతకులకోసం.

4

రాత్రి ఏడు దాటింది.

చూడవలసిన ఫైల్సన్నీ చూసి డిస్పోజ్ చేసేశాడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ.

గంటక్రితమే సైట్ నుంచి వచ్చాడు అతను.

ఆఫీసులో కూర్చుని పని పూర్తి చేశాడు. రెండు చేతులూ పైకెత్తి వళ్ళు విరుచుకున్నాడు.

టెలిఫోన్ గణగణ మ్రోగింది.

విసుగ్గా చూశాడు సత్యనారాయణ.

రిసీవర్ ఎత్తి "ఇ. ఇ. సత్యానారాయణ స్పీకింగ్" అన్నాడు.

"నమస్కారం సార్" కోకిల కంఠం వినిపించింది.

"ఎవరు?" హుషారెక్కింది ఆడగొంతు వినగానే.

"కనుక్కోండి చూద్దాం."

పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లయింది సత్యనారాయణకి, ఎవరని చెప్పడం? అతనికి సెక్స్ సంబంధాలు వున్న వాళ్ళు ఎందరో వున్నారు గతంలో. డబ్బుంది, అధికారం వుంది. ఇక ఆడవాళ్ళకి కొదవేముంది?

"ఐ యామ్ సారీ. గుర్తించలేకపోతున్నాను."

"అంతేలెండి. మనిషి దూరమైతే మర్చిపోతారు మీరు" నవ్వు వినిపించింది గలగలా పారే సెలయేరులా.

"ఎక్స్క్యూజ్ మీ! ఎవరో మీరు?"

"మీరు అనకండి. ఒకప్పుడు మీ క్రింద పనిచేసిన దాన్ని. మీ క్రింద నలిగినదాన్ని నేను."

అయినా గుర్తుకు రావడంలేదు. అతని సర్వీసులో ఎందరో నలిగారు అతని కబంధ హస్తాల్లో. ఎవరని చెప్పడం?

"కొంపతీసి సీతవి కాదుగదా!"

"సీతను కాను స్వరూపని."

"హాయ్! స్వరూపా! నువ్వా! ఎన్నాళ్ళకి విన్నాను నీ తేనెవంటి కంఠం. నాలుగేళ్ళయింది నిన్ను చూసి. మళ్ళీ కన్పించనేలేదు" కుర్రాడిలా కుర్చీలో నుంచి ఎగిరాడు.

"ఏదీ! మీ దయలేకపోయింది గదా! లేకపోతే మీ 'బెటర్ హాఫ్ నయ్యేదానిని."

"సారీ స్వరూపా! సర్కుమన్స్టెన్సెస్ అలా వచ్చాయి. నిన్ను మోసంచేసే వుద్దేశ్యం ఏ మాత్రంలేదు నాకు. నా కంటే పదిహేనేళ్ళు చిన్నదానివి. అయినా నన్ను గాఢంగా ప్రేమించావు. నాకు చాలా గర్వంగా వుండేది కూడా.

నిన్ను పెళ్ళి చేసుకోవాలని కలలుగన్నాను. నీ అందం నేనే స్వంతం చేసుకుని ఎంజాయ్ చెయ్యాలనుకున్నాను. నిన్ను పోగొట్టుకోవలసి వచ్చింది మా మామ మూలంగా. దట్ ఓల్డ్ రోగ్ ....డర్టీ క్రీచర్ .... చేతిలో నా జుట్టు నుండిపోయింది. నా భార్య తండ్రిగదా అని, ఆమె

పోయినా నా పిల్లల్ని ఆయన దగ్గరే వుంచాను. నేను సంపాదించేదంతా ఎప్పటికప్పుడు పంపించాను. నీకు తెలియంది ఏముంది?

నిన్ను పెళ్ళి చేసుకుంటే పిల్లల్తోపాటు, డబ్బుగూడా వదులుకోవాల్సి వస్తుందని బెదిరించాడు. ఎలా చెప్పు మరి. ఈ రోజుల్లో డబ్బులేకుండా ఎలా బ్రతకాలి. ఒక్కటి గుర్తుపెట్టుకో స్వరూపా! ఈ రోజుల్లో ఏదైనా అనుభవించవచ్చును గాని, దరిద్రాన్ని అనుభవించడం చాలా కష్టం."

"నగ్న సత్యం సెలవిచ్చారు."

"ఏమిటి విశేషాలు?"

"మీరే చెప్పాలిసార్. నేను మా వారు డామ్‌చూడ్దామని వచ్చాం. ఈ సమయంలో మీరు ఆఫీసులో వుంటారని నాకు తెలుసుగదా. ఫోన్ చేశాను."

"వెరీగుడ్. నీకు జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ."

"థాంక్స్."

"వట్టి థాంక్సేనా? ఇంకేమీ లేదా?" చిలిపిగా ప్రశ్నించాడు.

"మీ బుద్ధి పోనిచ్చుకున్నారు గాదు. ఎలా చెప్పండి? మా వారు వెంటవున్నారుగదా?"

"నేనేం చెప్పను? మనసుంటే మార్గం వుండక పోతుందా?" నవ్వాడు.

"ఆలోచిస్తాను."

"ఎక్కడనుంచి నువ్వు మాట్లాడేది?"

"సీత సదన్ గెస్ట్‌హౌస్ నుంచి."

"ఎందరు పిల్లలు?"

"ఒక్కడే కొడుకు."

"మీ శ్రీవారు ఏంచేస్తుంటాడు?"

"అవన్నీ మనం కలుసుకున్నాక మాట్లాడుకుందాం."

"మనం కలుసుకునేది నిజమేనంటావా?" ఆనందంతో అన్నాడు.

"మనం కలుసుకునేది నిజం. స్వర్గంలో తేలేది నగ్న సత్యం. మీకు గుర్తులేదూ? సిటీ వెళ్ళినప్పుడు ఏ.సి. హోటల్ రూములో...."

"అబ్బ ఎంత తియ్యటి రోజులు. నోట్లో నీళ్ళూరుతున్నాయి. ఇంతకీ ఎక్కడ మనం కలుసుకునేది?"

"మీ క్వార్టర్ కే వస్తాను. రాత్రి ఏదోక సమయం చూసుకుని బయల్దేరతాను. అయితే మనం గడిపేది జల తరగింణి జలపాతం దగ్గర. ఎన్నాళ్ళయిందో ఆ జలపాతం చూసి. ఎత్తుగా కొండమీదనుంచి లోయలోకి దూకే నీళ్ళు చూస్తుంటే నా మనసు పరవశించి పోతూ వుంటుంది."

"ఓ.కే....అలాగే."

"మీకోసం ప్రత్యేకంగా ఓ గొప్ప బహుమతి పట్టుకొచ్చాను."

"ఏమిటది?"

"అబ్బ! చెప్పను. చూస్తారుగా!" వూరిస్తునట్లుగా అంది స్వరూప.

"సరే....సరే....నీ ఇష్టం. నీ కోసం నిద్రపోకుండా ఎదురు చూస్తుంటాను."

"అలాగే చూడండి. నేను మీ క్వార్టర్ ముందు కారు ఆపి హారన్ కొడతాను. ఒక్క నిముషంలో మీరు కారు ఎక్కేసెయ్యాలి."

"ఏమిటీ నీకు కారుందా?"ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"ఒక్కటేమిటి నాలుగున్నాయి. ఆశ్చర్యపడకండి. నేనే స్వయంగా నడుపుకుంటూ వస్తాను."

"నాకు మతి పోతోంది."

"మతి దగ్గరుంచుకోండి. ఒక్క సంగతి గుర్తుంచుకోండి. ఇలా మనం కలుసుకోబోతున్నట్లు ఎవరికీ చెప్పకండి. బైటికి పొక్కిందా మా వారు సైలెన్స్ పిస్టల్‌తో ఇద్దర్నీ కాల్చి చంపుతాడు."

"ఓకే.... నేనంత తెలివి తక్కువవాడినా? అయినా ఎవరున్నారు నేను చెప్పుకోవడానికి?"

"ఓకే....సీ....యూ!"

అవతల ఫోన్ పెట్టేసినట్లు క్లిక్‌మంది.

సత్యనారాయణ రిసీవర్ క్రెడిల్ చేశాడు.

మనసు సంతోషంతో వుక్కిరి బిక్కిరై పోతోంది.

మళ్ళీ ఎన్నాళ్ళకి తను స్వరూపతో గడపబోతున్నాడు?

మనసు గతంలోకి జారుకుంది.

స్వరూప మేనమామో. బాబాయో గుర్తులేదుగాని మొదటిసారిగా తీసుకొచ్చి పరిచయం చేశారు. ఆమె అందం చూసి తన కళ్ళు చెదిరాయి. ఆమె కుటుంబం చాల అసహాయ స్థితిలో వుందనీ వుద్యోగం కావాలనీ అర్థించారు.

సర్కిల్ ఆఫీసులో క్లర్క్ పోస్టు ఖాళీగా వుందని తను తెలుసుకున్నాడు. తన పలుకుబడి వుపయోగించి ఆమెను టెంపరరీ క్లర్కుగా అపాయింట్ చేయించాడు. తర్వాత కొద్ది రోజులకే ఆమెను తన డివిజన్ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

తనకి భార్యపోయి రెండేళ్ళు అయింది అప్పటికి. మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి మనస్కరించలేదు. ముప్ఫై అయి

ఏళ్ళు నిండాయి. ఇద్దరు పిల్లలున్నారు.

పెళ్ళిచేసుకుంటే ఎన్నో గొడవలు వస్తాయి. సవతి తల్లి సరిగా పిల్లల్ని చూడదు. ఇదంతా ఎందుకని తను అలాగే గడపదల్చాడు. పిల్లల్ని వాళ్ళ తాతగారే పెంచు తున్నాడు.

డబ్బు అధికారం వుంటే ఆడవాళ్ళకి కొదవేముంది? కాని, స్వరూప ఒక పట్టాన లొంగలేదు-తను ప్రేమించి నట్లు నటించాడు. పెళ్ళిచేసుకుంటానని నమ్మించాడు. దాదాపు పెళ్ళాం లాగా వెంట త్రిప్పుకున్నాడు, ఆమె అందాన్ని జుర్రుకున్నాడు. పెళ్ళి చేసుకోమని అప్పు డప్పుడూ గొడవచేసేది. తను ఏదో కుంటిసాకులు చెప్పి తప్పించుకునేవాడు.

అప్పటికి తమ సంగతి మామగారికి తెలిసింది. పెళ్ళి చేసుకుంటే ఆస్తి ఇవ్వనని గొడవ పెట్టాడు. స్వరూపని ఎలాగైనా వదులుకోమని వార్నింగ్ ఇచ్చాడు.

ఇంతలోనే స్వరూప టెంపరరీ వుద్యోగం వూడింది. తను సంతోషించాడు. తను తల్చుకుంటే ఎలాగో అడ్జెస్టు చేసేవాడు. కాని తను సహాయం చెయ్యలేదు- తనను నిష్ఠూరాలాడి వెళ్ళిపోయింది. మళ్ళీ ఇదే కన్పించడం.

సత్యనారాయణ నిట్టూర్చాడు.

5

ఆ రోజు ఆదివారం—

సెలవురోజు కాబట్టి నదిమీద కట్టిస్తున్న డామ్, రిజర్వాయరు చూడటానికి టూరిస్టు బస్సులలో యాత్రి కులు వస్తుంటారు.

డామ్‌కు పదిమైళ్ళదూరంలో జలతరంగిణి అనే జల పాతం వుంది. మూడువందల అడుగుల ఎత్తు నుంచి మారు

తుంది నది లోయలోకి. దూది పింజల్లాంటి తెల్లటి మేఘాల్లా నీటి తుంపరలు అద్భుతంగా కనిపిస్తాయి. ఎంత సేపైనా అలా చూడాలనిపిస్తుంది జలపాత దృశ్యం. డామ్ చూడటానికి వచ్చేవాళ్ళంతా జలపాతం చూడ్డానికి తప్పకుండా వస్తుంటారు.

ఆ రోజు జలపాతం అందచందాలు తిలకిస్తున్న వాళ్ళకి లోయలో జలపాతం నదిలో కలిసేచోట తెల్లటి బట్టలు కట్టుకున్న వ్యక్తి విగతజీవుడై కన్పించాడు.

శవాన్ని దగ్గరగా చూడ్డానికి చాలమంది కుర్రాళ్ళు లోయలోకి దిగారు.

పల్చటి లాల్చీ, పైజమా వుంది అతనికి. బట్టతల. చేతికి వాచీ, పసుపురంగులో మెరుస్తున్న వుంగరం వున్నాయి అతనికి.

నాలుగైదు టూరిస్టు బస్సుల వాళ్ళున్నారు అక్కడ. వివిధ ప్రదేశాలనుంచి వచ్చిన వాళ్ళు. అతను ఎవరో ఎవరికీ తెలియదు. అక్కడ జలపాతం వుందిగాని గెస్టుహౌస్ లేదు. వానవస్తే తలదాచుకునేందుకు,జలపాతాన్ని చూడానికి వీలుగాను ఒక రేకుల షెడ్డుమాత్రం వుంది. చీకటి పడితే నరసంచారం వుండదు. అక్కడ.

టూరిస్టు బస్సులవాళ్ళు డామ్‌కి వెళ్ళాక పోలీస్ స్టేషన్లో చెప్పారు జలపాతం దగ్గర ఒక శవం వుందని.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్-ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు వగైరా పోలీసు సిబ్బంది వాన్‌లో బయల్దేరి వెళ్ళారు.

ఆ శవాన్ని చూసి ఆశ్చర్యపోయారు పోలీసులు. అతను వాళ్ళందరికీ తెలిసినవాడే. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

సత్యనారాయణ.

జలపాతం పైనుంచి క్రిందపడడంవల్ల రాళ్ళుతగిలి తల పగిలింది. నెత్తురు చాలాపోయి చనిపోయివుంటాడు.

శవపంచాయితీ జరిపి డామ్ హాస్పటల్ కి పంపించారు పోస్టుమార్టమ్ రిపోర్టుకోసం.

అతని పైజమా జేబులో ఇంటితాళాల గుత్తి మాత్రం వుంది.

పోస్టుమార్టమ్ చేశాక మార్చురీలో వుంచారు శవాన్ని. అతనికి డామ్‌లో బంధువులు ఎవరూలేరు. దాదాపు ఎకరం స్థలంలో వున్న పెద్దక్వార్టరులో ఒంటరిగా వుంటున్నాడు.

ఆ క్వార్టర్ కి తాళంవేసివుంది. షెడ్ లో జీప్ వుంది. మరి అంతదూరం ఎలా వెళ్ళాడో అర్థంకావడంలేదు. అసలు అది హత్యా? లేక ఆత్మహత్యా అనేది నిర్ధారణ చెయ్యలేక పోతున్నారు.

శనివారం రాత్రి ఎనిమిదింటికి తనను వెళ్ళిపొమ్మని తలుపు వేసుకున్నాడని ఇంట్లో పనిచేసే వీరయ్య అనే అతను చెప్పాడు.

పోస్టుమార్టమ్ రిపోర్టులో ఇంకా ఆశ్చర్యం కలిగించే విషయం బైటపడింది. అతను బాగా త్రాగి వున్నాడని తేలింది. అతను త్రాగిన మద్యంలో విషం కలిసి వుందని డాక్టర్ చెప్పాడు.

అంత ఎత్తునుంచి పడిపోయి తల పగిలి చనిపోయాడనీ ఒకవేళ కాళ్ళు చేతులు విరిగి తప్పకుండా ఎవరో విష ప్రయోగం చేసివుంటారని వూహించారు.

ఆత్మహత్య చేసుకునేవాడికి అంతదూరం వెళ్ళవలసిన అవసరం ఏముంది?

కాబట్టి, ఎవరో అతన్ని మంచితనంతో తీసుకెళ్ళి త్రాగించి, అందులో విషం కలిపి, పైనుంచి నెట్టివేశారు.

ఎవరు అతన్ని హత్య చేసింది?

విజయవాడలో వుంటున్న అతని అత్తమామలు, బామ్మర్దులు, అతని పిల్లలు వచ్చారు.

శవాన్ని వాళ్ళకి అప్పగించారు పోలీసులు.

అతనికి శత్రువులు ఎవరో? ఎవరూ చెప్పలేక పోతున్నారు.

పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తూనే వున్నారు.

ఇంకా తేలలేదు హత్య చేసింది ఎవరో?

అది తేలదు. కేసు మూసి వేయాల్సిందే అనే పరిస్థితికి వచ్చారు పోలీసులు.

6

ఎండాకాలం-

అంతా ఆరుబైట వేసుకుని పడుకున్నారు.

రమణమూర్తి గూడా ఆరుబైట పడుకున్నాడు. రెండో మంచంమీద మూడేళ్ళ కొడుకు బాలు నిద్రపోతున్నాడు

ఇంటి చుట్టూ ప్రహరీగోడ. మధ్యలో రెండు గదుల ఇల్లు ముచ్చటగా వుంటుంది.

అతను ఎంతో కష్టపడి కట్టించుకున్నాడు ఆ ఇల్లు.

నాలుగేళ్ళ క్రితం పెళ్ళయింది రాణీతో అతనికి. రాణీ వచ్చిన వేళావిశేషం ఏమోగాని అతనికి మంచి రోజులు వచ్చినాయి. ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. అరియెర్స్‌తో చెల్లెలి పెళ్ళిచేసి పంపేశాడు. జీతం డబ్బులంటే లెక్కలేదు అతనికి. జీతానికి నాలుగురెట్లు లంచాలు వస్తున్నాయి. అంతా రాణీ అదృష్టమే అనుకున్నాడు. టౌన్ చివర చౌకగా వస్తుంటే మూడువందల

గజాల సలంకొని చిన్న ఇల్లు కట్టించాడు. చుట్టూ ప్రహరీ గోడ. నిమ్మ, దానిమ్మ, మల్లె, గులాబీ, మందార మొక్కలు నాటించాడు. అద్దె ఇంట్లో వుండే బాధ తప్పింది. వూరు చివర ఇప్పుడిప్పుడే డెవలప్ అవుతున్నది. అసలు ఇంటిముందు కూర్చుంటే పొలాల మీదనుంచి వచ్చే చల్లటిగాలికి పల్లెటూళ్ళో వున్నట్లు ఫీలయ్యేవాడు. టౌన్‌లో వుంటూ పల్లెటూరి వాతావరణం అనుభవించే అదృష్టం కలిగింది. ఆఫీసుకి వెళ్ళిరావడం కష్టంగా వుందని స్కూటర్ కొన్నాడు.

ఏటిలో తెరచాప ఎత్తిన పడవలా హాయిగా గడిచి పోతూ వుంది అతని జీవితం.

"బాబు తర్వాత ఒకపాప పుడితే ఇక చాలండీ" అంటూ వుండేది రాణి.

"ఏరా! నీకు తమ్ముడు కావాలా? చెల్లాయి కావాలా?" అంటే బాలు "తమ్ముడు" అనేవాడు.

"కాదు. చెల్లాయి....అను...."అనేది రాణి నవ్వుతూ.

బాలు తల అడ్డంగా వూపేవాడు.

అటువంటి మధురమైన జీవితంలో అపశ్రుతి పలికింది ఆ రోజు.

తెల్లవారితే ఆదివారం సెలవు గనుక శనివారం రెండో ఆట సినిమాకి వెళ్ళడం మామూలే.

ఆ రోజు అలాగే రెండో ఆట సినిమాకి వెళ్ళివస్తున్నారు.

ఎదురుగా ఏదో జీప్ అడ్డం వచ్చింది వూరి చివర. దాని డ్రైవర్ బాగా త్రాగి వస్తున్నట్లు మెలికలు తిరుగుతోంది జీప్. రమణమూర్తి అది గమనించి స్కూటర్ రోడ్డు దించి నిలబెట్టాడు తప్పుకున్నాక పోదామని.

అయితే జీపు తప్పుకోలేదు. ఆగింది.

అందులోనుంచి నలుగురు బలిష్టమైన మనుషులు దిగారు. నల్లగా భయంకరంగా వున్నారు. చూస్తుంటేనే తెలిసిపోతూ వుంది వాళ్లు గూండాలని.

బాగా తాగి వున్నారు. కళ్లు ఎర్రగా వున్నాయి.

ఆ వెన్నెల్లో వాళ్ళ దృష్టి రాణీమీద పడింది.

"దిగరా!" అన్నాడు ఒకడు.

మరొకడు దిగేదాకా వూరుకోలేదు చొక్కా పట్టుకుని క్రిందకు లాగాడు.

బాలు కెవ్వుమని అరిచాడు.

రాణీకి ఏడుపు ముంచుకొచ్చింది.

"బాబూ! నా నగలన్నీ ఇచ్చేస్తా. మమ్మల్ని ఏం చెయ్యకండి" అంది.

"నగలు మాకెందుకే. నువ్వు కావాలి ఈ రాత్రికి" అన్నాడు ఒకడు వికటంగా నవ్వుతూ.

"అయ్యా! నన్ను వదలండి. నా జీవితం నాశనం చెయ్యకండి...." అంటూ ఏడుస్తోంది.

వాళ్ళకి హృదయం అంటూ వుంటేగా ఆమె ఏడుపు విని కరగడానికి.

రమణమూర్తి ప్రతిఘటించబోయాడు. అతన్ని దూరంగా నెట్టివేశారు.

బాలూ ఆకాశం దద్దరిల్లేట్టట్లు ఏడుస్తున్నాడు.

ఆమెను బరబరా ఈడ్చుకుపోయారు.

ఆమె ఏడుస్తోంది గుండెలు పగిలేటట్లు.

జీపులో పడేసి కదలకుండా పట్టుకున్నారు. అరవకుండా, ఏడవకుండా నోట్లో గుడ్డలు కుక్కారు.

మూడు కోట్లమంది దేవతలు వున్నారని పురాణాల్లో

ఘోషిస్తూ వుంటారు.

త్రిమూర్తులు అనేవాళ్లు ప్రపంచాన్ని రక్షిస్తుంటారు. ఎందరో శక్తిస్వరూపిణులున్నారు.

ఏ దేవుడూ, ఏ దేవతా రాణీని కాపాడలేక పోయారు.

నడిరోడ్డులో దారుణంగా భర్తనుంచి, బిడ్డనుంచి వేరు చేసి తమ కామదాహం తీర్చుకోవడానికి రాణీని తీసుకు పోతుంటే ఆ దుర్మార్గుల్ని శిక్షించడానికి ఏ దేవుడికీ శక్తి లేకపోయింది.

దేవుళ్ళున్నారట? ఎందుకు?

కాకీ బట్టల పోలీసులున్నారు? ఎందుకు?

ఈ దేశంలో ఆడదాన్ని రక్షించలేరు దుర్మార్గుల బారి నుంచి.

రామరాజ్యమట. పుణ్యభూమి, పవిత్రదేశం పేపర్ల మీద డబ్బా కొట్టుకోవడం.

మర్నాడు వచ్చింది రాణీ వాళ్ళ కామదాహం తీర్చి.

రమణమూర్తి ఇంటి తలుపు తెరవలేదు.

ఆమె తప్పు ఏమీ లేదని అతనికి తెలుసు. తప్పు చెయ్యనప్పుడు శిక్షించగూడదనీ తెలుసు. కాని ఆ సంగతి నలుగురికీ తెలిసిపోయింది. శీలంపోయిన ఆడదిగా ఆమెకు ముద్ర పడిపోయింది. అటువంటి భార్యను ఏలుకున్నందుకు సమాజం అతన్ని హింసిస్తుంది. నాగరిక సమాజం గదా! అందుకు ఆ సమాజానికి భయపడి భార్యను ఏలుకోలేక పోయాడు ఆ మగాడు.

ఈ దేశంలో మగాళ్ళు రాముడి అడుగుజాడల్లో నడ వాలి మరి.

రాణీ ఆశోప హతురాలై ఎటో వెళ్ళిపోయింది.

మర్నాడు రైలు క్రిందపడి ప్రాణాలు తీసుకుంది. ఆమె శవాన్ని ఇంటికి తీసుకురాలేదు. హాస్పటల్ నుంచి అటే స్మశానానికి తీసుకెళ్ళి భూస్థాపితం చేశాడు.

భార్యని రక్షించుకోలేని అసమర్థుడు, చెయ్యని తప్పుని క్షమించలేని చవట అని అందరికీ తెలిసినా అతనికి పిల్లనివ్వడానికి తిరుగుతున్నారు ఆడపిల్లల తండ్రులు.

అతనికే ఇష్టం లేకుండా పోయింది. మొన్న మొన్నటి వరకూ అతని తల్లి వుండేది. ఇప్పుడామె స్వర్గానికి పోయింది. బాలు రక్షణ అతనికి సమస్యగా వుంది.

రమణమూర్తికి ఎందుకో మెలకువ వచ్చింది. కళ్ళువిప్పి చూశాడు.

తన మంచంమీద రాణీ కూర్చుని వుంది. తెల్లటి జాకెట్టు తెల్లటి చీర. వెన్నెల్లో మెరిసిపోతున్న దేవతలా వుంది.

ఏడుస్తోంది ఆమె.

రమణమూర్తి లేవాలని అనుకున్నాడు. ఆమెను ఓదార్చాలని తహతహలాడాడు. ఎందుకో లేవలేకపోతున్నాడు. గొంతుగూడా పెగలడంలేదు. శక్తి హరించుకుని పోయినవాడిలా కళ్ళు తెరుచుకుని చూస్తూ వుండిపోయాడు.

ఆమె అతన్ని ముద్దాడింది.

"నన్ను క్షమించండి...." అంటోంది.

నిద్రపోతున్న బాలూని గుండెలకు హత్తుకుంది. ముఖాన్ని ముద్దులతో నింపివేసింది.

ఆమె కళ్ళల్లోనుంచి ధారాపాతంగా వర్షిస్తున్నాయి నీళ్ళు.

తర్వాత ఆమె అతని తలగడ క్రింద నుంచి తాళం

తీసుకుంది.

ఆమె చేతిలో నల్లటి సంచి వుంది.

"ఏమండీ! ఇందులో డబ్బుంది. దాంతో బాలూని రాజాలా పెంచండి. గొప్పవాడిని చెయ్యండి" అంది.

ఇంటి తాళం తీసి లోపలకు వెళ్ళింది. ఐరన్ బీరువా తీసిన చప్పుడైంది.

మళ్ళీ ఇంటికి తాళాలు వేసి వాటిని అతని తలగడ క్రింద పెట్టేసింది.

"బాలూని....వాడిని అమెరికా పంపండి చదువుకోడానికి. ఏ లోటూ చెయ్యకండి...."అంటూ వుంది రాణి.

రమణమూర్తి కళ్ళు మూసుకుపోయాయి. నిద్రలోకి జారిపోయాడు.

మర్నాడు ఎండ చుర్రుమనేదాకా మెలకువ రాలేదు అతనికి.

బాలు ముందు లేచాడు అతనికంటే.

పనిమనిషి వాకిలి ముందు వూడుస్తోంది. "అయ్యగారూ! పాలు వచ్చాయి...." అంది.

పాలమనిషి కాన్ పట్టుకుని వుంది.

అతను లేచి ఇంటి తాళంతీసి పాలగిన్నె తెచ్చి పాలు పోయించుకున్నాడు.

పనిమనిషి వంటగదిలోని అంట్లు తెచ్చి బావి దగ్గర పడేసి తోమసాగింది.

ఉన్నట్టుండి రాత్రి రాణీ అతని కలలోకి రావడం జ్ఞాపకం వచ్చింది.

అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ముభావంగానే కాలకృత్యాలు తీర్చుకున్నాడు. బాలు తొమ్మిదింటికి కాన్వెంట్ రిక్షా రాగానే వెళ్ళిపోయాడు.

రమణమూర్తి భోజనం చేశాడు.

బట్టలకోసం బీరువా తీశాడు.

అంతే. శిలా విగ్రహంలా నిల్చుండిపోయాడు. అతని కళ్ళు బైర్లు క్రమ్మాయి.

బీరువాలో వందరూపాయల నోట్లకట్టలు ఒక అర నిండా పేర్చి వున్నాయి.

కలా?

నిజమా?

అని కాసేపు నివ్వెరపోతూ వుండిపోయాడు.

అది కలకాదనీ వాస్తవమేననీ నిర్ధారించుకున్నాక మతి పోయినట్టయింది.

అంటే రాణీ రాత్రి నిజంగా వచ్చిందా? బాలూ కోసం డబ్బు ఇచ్చి వెళ్ళిందా?

అది ఎలా సాధ్యం?

చనిపోయిన రాణీ ఎలా వస్తుంది?

వచ్చినా ఇంత డబ్బు....కాస్తాకూస్తా కాదు లక్షల కొద్దీ డబ్బు ఎలా వస్తుంది?

ఒకవేళ రాణీ చనిపోలేదా?

రమణమూర్తి తల బ్రద్దలై పోతోంది.

7

ఆ దొంగల ముఠాకి నాయకుడు రాజాసింగ్. ఎత్తుగా బలంగా వుంటాడు. నల్లగా కండలు తిరిగిన శరీరం. చూస్తే ఎవరికైనా జంకు కలుగుతుంది.

అతను స్వతహాగా తెలివైనవాడు. నిప్పుకి గాలి తోడైనట్టుగా రాణీ అతనికి జత కుదిరింది.

ఇద్దరూ కలసి ఎన్నో దొంగతనాలకు ప్లాన్ చేశారు. విజయవంతంగా దోపిడీ సాగించారు. పోలీసులకు అంతు

చిక్కని తరహాలో వుంటుంది ప్లాన్.

ఆ ముఠాలో పదిమంది వున్నారు. అంతా నమ్మకస్థులు. రామభక్త హనుమాన్‌లాగా రాజాసింగ్ మాట జవ దాటరు. దోపిడీలో ఎంత వచ్చింది అని ఎప్పుడూ ఆరా తియ్యరు. ఇచ్చింది తీసుకుంటారు. జల్సాగా ఖర్చుపెట్టు కుంటారు. సుఖాన్ని జుర్రుకుంటారు డబ్బు అయిపోయే దాకా.

"ఎన్నాళ్ళు మనం ఇలా కక్కుర్తి దొంగతనాలు చేయడం?" అంది రాణి రాజాసింగ్ భుజంమీద చెయ్యి వేసి.

రాజాసింగ్ ప్రేమగా ఆమె చేతిని పట్టుకున్నాడు.

"మన వృత్తి అదే అయినప్పుడు తప్పేది ఏముంది?" అన్నాడు.

వాళ్ళిద్దరూ కాక దాసు, సిద్ధప్ప అని ఇద్దరు వున్నారు గదిలో.

సినమాలో చూపించే దొంగల గుహలా లేదు అది. మోడరేట్‌గా విలువైన ఫర్నిచర్‌తో నిండివుంది ఏ.సి. రూమ్ చల్లగాలితో హాయిగా వుంది.

"నాకో ఐడియా వచ్చింది."

అంతా రాణివంక చూశారు.

"ఇప్పుడు దేశంలో అంతా ఘరానాగా దొంగతనం చేస్తూ పెద్దమనుషులుగా తిరుగుతున్నారు. మనం చాటుగా దొంగతనాలు చేస్తూ చాటుగా తిరగడం ఎందుకు? ఎప్పుడో ఒకప్పుడు దొరికిపోతే జీవితాంతం జైల్లో పడి చావాలి కదా?" అంది.

"అయితే ఏం చెయ్యాలంటావ్? అదంతా వాళ్ళ అదృష్టం" అన్నాడు సింగ్.

రాణీ ముఖం గంభీరంగా అయ్యింది.

"అదే తెలిస్తే. ఎవరి అదృష్టం వాళ్ళ చేతుల్లో వుంది."

"ఎలా చెప్పా చూద్దాం?"

"మనం చిల్లర దొంగతనాలు మానేద్దాం. ఏదైనా పెద్ద దొంగతనం ఒక్కటే ప్లాన్ చేద్దాం. డబ్బంతా కూడేసి సిటీలో పెద్ద ఫ్యాక్టరీ పెట్టి పబ్లిక్‌గా బ్రతుకుదాం. స్వేచ్ఛగా జీవించుదాం. ఇప్పుడు మనకి ఎంత డబ్బున్నా సుఖం లేదు గదా!" అంది.

"నీ ఆలోచన బాగానే వుంది" అన్నాడు దాసు.

"హాయిగా బ్రతకాలని యెవరికి లేదు" అన్నాడు సిద్ధప్ప.

"డబ్బంతే సరా! మనం ఎలా ఫ్యాక్టరీలు పెట్టాలో తెలియాలి. అది సరిగ్గా నడవాలి. లాభాలు రావాలి. లేకపోతే దివాళాతీసి రోడ్డున పడతాం" అనుమానంగా అన్నాడు సింగ్.

"భయం ఎందుకు? నేను లేనూ అన్నీ చూసుకోవడానికి. ఈ రోజుల్లో ధయిర్యం చెయ్యాలిగాని యే వ్యాపారం చేసినా డబ్బువర్షం కురుస్తుంది. మాటవరసకి ఫ్యాక్టరీ అన్నానుగాని సిటీలో మంచి సెంటర్ చూసి ఫైవ్ స్టార్ హోటల్ కట్టిద్దాం."

దాసు చప్పట్లు కొట్టాడు.

"నీ బుర్ర అమోఘం" అన్నాడు.

"నా బుర్ర సంగతి యిప్పుడేం తెలుస్తుంది. ముందు ముందు తెలుస్తుంది. మనకి అసాధ్యం యేదీ లేదు" అంది రాణి.

రాణీ ఆలోచన బాగానే వున్నట్లనిపించింది. తర్జన భర్జనలు చేశారు. తమ దగ్గర యెంత బంగారం వుంది,

యెంత డబ్బుంది అంచనా వేశారు. దానికి తోడు పెద్ద ఛాన్స్ కొడితే సరిపోతుంది. పది మంది హాయిగా బ్రతుకుతారు అనిపించింది.

"పెద్ద దొంగతనం యెక్కడ చెయ్యాలి మనం?" అన్నాడు దాసు.

"అది మీరు చూసుకోండి. ఏదైనా బ్యాంకును దోచేద్దాం" అంది రాణి.

"నాకూ అలాంటి సాహసం చెయ్యాలని చాలా రోజులనుంచి కోర్కెగా వుంది" అన్నాడు సిధప్ప.

"ఆఖరిసారి నీ కోర్కె తీర్చుకో" అంది రాణి నవ్వుతూ.

"వారం లోపలే నిర్ణయిస్తాను" అన్నాడు సిధప్ప.

"గుడ్" అంది రాణి మెచ్చుకోలుగా చూసి.

అనుకున్నట్లే నాలుగు రోజుల్లో సిటీ అంతా సెర్చ్ చేసి తను దోపిడీ చెయ్యదల్చుకున్న బ్యాంక్‌ని యెన్నుకున్నాడు సిధప్ప.

ఏ.బి.సి. కాలనీ బ్యాంక్ అది.

ఏ.బి.సి. ఫ్యాక్టరీ కాలనీలో దాదాపు పదివేలమంది పనిచేస్తున్నారు.

వాళ్ళకి ఫస్టు తారీఖున జీతాలు యిస్తారు. దాదాపు ఏడెనిమిది లక్షలు డ్రా చేస్తారు ఫ్యాక్టరీ వాళ్ళు. నెలాఖరు రాత్రికి బ్యాంకును దోచెయ్యాలి. అదృష్టం బాగుంటే పదిహేను, ఇరవై లక్షలు దొరకవచ్చు. సిటీకి దూరంగా వుంది కాబట్టి అట్టే ప్రమాదం లేదు.

ఆ బ్యాంక్ గూడా చుట్టూ ప్రహరీతో విశాలమైన కాంపౌండ్‌లో వుంది. అందులో దొంగతనం జరిగిన సంగతి తెల్లారే వరకూ యెవరూ తెలుసుకోలేరు. ఈ

లోపల సురక్షితంగా బయటపడవచ్చు.

రాణి, రాజాసింగ్ కూడా వెళ్ళి బ్యాంక్ భవనం చూసి వచ్చారు.

పథకం సిద్ధం చేశారు.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఆ కాలనీకి కరెంట్ సప్లయ్ చేసే ట్రాన్స్‌ఫారం వద్ద సప్లయ్ ఆపివేయాలి. ఆ టైములో ఫ్యాక్టరీ పనిచేయదు కాబట్టి రిపేరుకోసం యెవరూ వచ్చే ప్రసక్తి రాదు. అయినా ట్రాన్సుఫారం దగ్గర ఒకళ్లు రహస్యంగా కాపలా కాస్తూ వుండాలి.

సిద్ధప్ప, దాసుల నాయకత్వంలో ఏడుగురు బ్యాంకు దోపిడీ పూర్తి చేస్తారు. రెండు జీపులు సిద్ధంగా వుంచుకోవాలి. ఒకటి ఏదైయినా ట్రబుల్ యిచ్చినా బాధ వుండదు.

ఈసారి రాజాసింగ్‌ని వెళ్ళొద్దంది రాణి. రాణీ సలహా ప్రకారం పూర్తి బాధ్యత అసిస్టెంట్లమీదే పెట్టాడు అతను. సిద్ధప్ప సాహసం చెయ్యాలనే మజాలో వున్నాడు.

8

పోలీస్ కమీషనర్ యింటికి వెళ్ళి బట్టలు మార్చుకుంటున్నాడో లేదో టెలిఫోన్ మ్రోగింది.

విసుగ్గా రిసీవర్ ఎత్తి "పోలీస్ కమీషనర్ రిసిడెన్స్ ప్లీజ్!" అన్నాడు.

"పోలీస్ కమీషనర్ గారేనా?"

"యస్.... స్పీకింగ్."

"ఇప్పుడు టైమెంతయింది?"

"నన్ను టైమడగడానికా నువ్వు ఫోన్ చేసింది

ఇంకెవరూ దొరకలేదా నీకు?" కోపంగా అన్నాడు.

టెలిఫోన్‌లో నవ్వు వినిపించింది.

"ఎందుకా నవ్వు?" దబాయించాడు.

"కోప్పడకండి సార్. సమయానికి చేతికి వాచీ లేదు. అందుకే మిమ్మల్ని అడిగాను. మీకు ఫోన్ చేసింది టైమ్ అడగడానికి కాదు—మీ కొక యింపార్టెంట్ అండ్ సీక్రెట్ యిన్ఫరమేషన్ యివ్వాలనే."

"ఏమిటీ, సీక్రెట్ యిన్ఫరమేషనా? ఎవరు నువ్వు?"

"చెప్తాను. ముందు టైమ్ చెప్పండి."

"ఏడు."

"గుడ్. చెప్తాను వినండి. ఇంకొక ఏడు గంటల తర్వాత అంటే రాత్రి సరిగ్గా రెండు గంటలకి ఎ.బి.సి. కాలనీ బ్యాంక్ దోపిడీ చెయ్యబడుతుంది."

"ఎలా తెలుసు నీకు?"

"అవన్నీ అడక్కండి."

"ఎవరు నువ్వు?"

"అదీ అడక్కండి ప్లీజ్. మీరు సీక్రెట్‌గా వ్యవహరించి ఆ ముఠాని పట్టుకోండి. బయటపడితే వాళ్ళు చిక్కరు."

ఫోన్ పెట్టేశారు.

పోలీస్ కమీషనర్ ఆశ్చర్యపోతున్నాడు అదంతా విని.

9

రాత్రి పన్నెండింటికే సిద్దప్ప, దాసుల నాయకత్వంలో రెండు జీపుల్లో, కావలసిన పరికరాలు సిద్ధం చేసుకుని వెళ్ళిపోయారు.

ఇక మిగిలింది రాజాసింగ్ ఒక్కడే.

అప్పటికే పూర్తి బాటిల్ పట్టించాను. రెండోది ఓ.పెన్ చేసింది రాణి.

"ఇక వద్దు రాణి...." మత్తుగా అన్నాడు సింగ్.

"ఈ ఒక్క గ్లాసు తీసుకో" అంది.

సింగ్ ఆ గ్లాసు చేతిలోకి తీసుకుని గట గట త్రాగేశాడు.

కుర్చీలోనుంచి లేచాడు. రాణి చేతిని పట్టుకుని బెడ్ మీదకు తూలాడు.

అతని కళ్ళు యెర్రగా వున్నాయి.

మెడలో పులిగోరు పతకం తళతళలాడుతోంది.

వంటిమీద బట్టలు ఏమీ లేవు అతనికి. లుంగీమాత్రం కట్టుకున్నాడు.

రాణీగూడా పల్చటి నైట్ గౌన్ రోజా రంగుది వేసుకుంది. దేవతావస్త్రంలాగా అది వున్నా లేదనిపించేటట్లు ఆమె శరీరంలోని వంపుసొంపులన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సింగ్ కి పిచ్చెక్కిపోతోంది ఆమె అందం చూసి. రోజూ అనుభవించినా తనివితీరడం లేదు అతనికి. ఆమెతో అనుభవం నిత్య నూతనంగా వుంటుంది సింగ్ కి.

రోజుకన్నా ఆమె ఆ రోజు వొంగుకో బాగా మేకప్ చేసుకుంది.

అదీ అతని ముందే. ముఖానికి మాత్రమే పూసుకునే క్రీమ్ వంటినిండా పట్టించింది. మందంగా పౌడర్ పూసుకుంది శరీరమంతా డబ్బా ఖాళీ అయ్యే వరకూ. ఫారిన్ సెంట్ బాటిల్స్ నాలుగు ఓపెన్ చేసి తన నైట్ గౌన్ మీద, రాజాసింగ్ లుంగీమీద, బెడ్ మీద ఒలికించింది.

ఏ.సి. రూమ్ రకరకాల పరిమళాలతో ముక్కులు

పగలగొట్టేట్టు నిండిపోయింది.

సింగ్ ఆమె చర్యలన్నీ గమనిస్తున్నాడు.

'ఆమెకు యెంతో సంతోషంగా వుంది యీ రాత్రి' అనుకున్నాడు.

ఆమె విస్కీ సీసాలోనుంచి మరొక గ్లాసు వంపి సింగ్‌తో త్రాగించింది.

అయిష్టంగానే త్రాగాడు.

"రా....రా...." అంటున్నాడు పిచ్చివాడిలా.

రాణి పిచ్చి పిచ్చిగా నవ్వింది.

"ఎందుకు?" అంది.

"అందుకే!" నవ్వాడు.

"అందుకు యిది కాదు సమయం" అంది.

"ఏం?"

"చెప్తున్నాను. కపిల నగరంలో జగపతిరావుని ఉరి తీసి చంపాను గుర్తుందా?"

"ఆఁ...."

"జలతరంగణి జలపాతంలోకి యింజనీర్ సత్యనారాయణని నెట్టేశాను."

"అవును....అవన్నీ యెందుకు యిప్పుడు?"

"చాల అవసరం."

"వాళ్ళిద్దర్నీ యెందుకు చంపాను?"

"వాళ్ళు నిన్ను మోసం చేశారని."

"అవును. నన్ను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారు. అందుకే సమయం చూసి చంపాను. నాది నాగుపాము పగ" నవ్వింది.

"నువ్వు నాగరాణివి...." నవ్వాడు సింగ్.

"అవునా?" పక పక నవ్వింది.

"అవును."

"నేను నా భర్తతో సినిమానుంచి తిరిగి వస్తుంటే నువ్వు స్కూటర్ మీద వున్న నన్ను నా భర్త నుంచి, బిడ్డనుంచి వేరుచేసి రాక్షసంగా చెరిచావు. అవునా?"

"అవును" సీరియస్‌గా అన్నాడు సింగ్.

"మరి నేను నాగరాణిని అయితే నీ మీద పగతీర్చుకోవద్దా? ఆ జగపతిరావుని, సత్యనారాయణలని పంపించిన దారిలో నిన్నూ పంపాలా, వద్దా?"

అయోమయంగా చూశాడు సింగ్.

"నేను చెడిపోయినదాన్నని నా భర్త నన్ను తిరస్కరించాడు. అప్పుడే యెందులోనన్నా పడి చనిపోవాలనుకున్నాను. కాని నాలో యేదో శక్తి ప్రవేశించింది. మోసగాళ్ళని మోసంతో జయించాలనే ఆలోచన వచ్చింది. నన్ను మోసం చేసినవాళ్ళమీద తిరుగుబాటు చేశాను.

నన్ను అనుభవించి వదిలేసిన తర్వాత నా అంతట నేనే నీ స్థావరానికి వచ్చి లొంగిపోయాను. భర్త ఎటూ వదిలేశాడు కాబట్టి నీకు వుంపుడుగత్తెగా ఉంటానని ప్రాధేయపడ్డాను. నువ్వు ఒప్పుకున్నావు.

నీ మట్టిబుర్ర వూహలకు అందకుండా నీ సహాయంతోనే నన్ను మోసంచేసినవాళ్ళందర్నీ చంపాను. నా బిడ్డ భవిష్యత్తు కోసం అంతులేని డబ్బు యిచ్చాను నా భర్తకి. నేను అక్కర్లేకపోయినా నే నిచ్చిన డబ్బు సహిస్తాడని నాకు తెలుసు. ఇక నేను చేయాల్సిన పని యేమీ లేదు ఈ లోకంలో. నిన్ను చంపడం ఒక్కటే

మిగిలింది" అంది రాణి.

సింగ్ బిత్తరపోయి చూస్తున్నాడు.

"నన్ను చంపుతావా?"

"చంపుతావా ఏమిట్రా పశువా? ఇప్పటికే సగం చచ్చావు. నువ్వు చివరిసారిగా త్రాగిన విస్కీలో విషం కలిపాను. ఇంకా సేపటికి నువ్వు చస్తావు. బ్యాంకు దోపిడీ చేస్తున్నారని పోలీసులకు తెలియజేశాను. వాళ్ళు అక్కడ పట్టుబడి జైల్లోకి పోతారు.

ఇక్కడ వున్నదంతా మూటగట్టి ఉంచాను. హాయిగా వెళ్ళిపోతాను నా కొడుకు దగ్గరకి. ఇప్పుడు లక్షాధికారిణిని కాబట్టి నా భర్తగూడా నా దగ్గర కుక్కలా పడి ఉంటాడు. ఉండకపోయినా బాధపడను." పకపక నవ్వు తోంది రాణి. ఆమె పూర్తి పేరు స్వరూపరాణి.

సింగ్ అదిరిపడ్డాడు.

"నన్నే మోసం చేస్తావా...." అంటూ దిండుక్రింద వున్న పిస్టల్ తీసి రాణికి గురిపెట్టాడు.

గుళ్ళు అయిపోయే వరకూ కాల్చాడు.

రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుని ప్రాణాలు వదిలింది రాణి.

సింగ్ త్రాగిన విషం పనిచేయసాగింది. స్పృహతప్పి ఆమెమీద పడిపోయాడు.

—: ఐపోయింది :—